క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి కార్పొరేటర్ విరాళం



ఆలయ కమిటీ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న కార్పొరేటర్ అనూష, లతీష్ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమాంబ, కుంచుమాంబ అమ్మవార్ల ఆలయాలకు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ దంపతులు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో కమిటీ ప్రతినిధులకు గురువారం విరాళం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నోటి తనిఖీ వైద్య శిబిరం రేపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నోటి తనిఖీ పరీక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు సమీప ఫస్ట్ ఎయిడ్ కేంద్రంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం నిర్వహించనున్నారు. సిగరెట్, ఖైనీ, గుట్కా, ఆల్కహాల్ అలవాట్లు ఉన్నవాళ్లు, అలవాటు ఉండి మానేసిన వాళ్లు తప్పకుండా హాజరై తనిఖీ చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు తనిఖీ చేయించుకోవచ్చని తెలియజేశారు.

విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

గాజువాక: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎల్ అండ్ టీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆ సంస్థ జనరల్ మేనేజర్ కె.వి.సుబ్బారావు ప్రారంభించారు. గాజువాక హైస్కూల్‌లో చదువుతున్న 1769 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సీఎస్సార్ హెడ్ ఇ.శ్రీనివాసరావు, సీఎస్సార్ ఎగ్జిక్యూటివ్ ఆర్.కె.రావు, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు వి.రమేష్ కుమార్, ఎస్.అప్పలరాజు, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గరికిపాటి ప్రవచనాలు

సీతమ్మధార: క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు తరలి రావాలని వారు కోరారు.

అప్పన్నకు నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేప చేసికల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు.

కార్పొరేట్‌కు దీటుగా యూపీహెచ్‌సీ

- 68వ వార్డు మింది రాంనగర్‌లో నిర్మాణం పూర్తి
- రూ.1.6 కోట్లతో ఆధునిక సదుపాయాలు
- త్వరలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు



68వ వార్డులో నిర్మాణం పూర్తయిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉన్న 10 పడకలు

అక్కిరెడ్డిపాలెం: పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలకనుగుణంగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని గాజువాక, తుంగ్లాం, గంగవరం, నమ్మిదొడ్డి జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రారంభమైన యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందుతుండగా 68వ వార్డు మింది రాంనగర్‌లో రూ.1.60 కోట్లతో ఆధునిక సదుపాయాలతో నిర్మించిన 10 పడకల డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని, పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా ఆరోగ్య కేంద్రం త్వరలో అందుబాటులోకి రానుంది.

63 రకాల పరీక్షలు..

రోగులు వైద్య పరీక్షల కోసం దూరం వెళ్లే పని లేకుండా ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలతో పాటు 63 రకాల పరీక్షలు చేయడానికి వీలుగా అత్యాధునిక ల్యాబొరేటరీని ఏర్పాటు చేశారు. రోగులకు అవసరమయ్యే 172 రకాల మందులు అందుబాటులో ఉంచారు. ఆస్పత్రిలో 2 ఓపీ రూములు, మీటింగ్ రూం, డ్రెస్సింగ్ రూం, ఫార్మసీ రూం, ఆపరేషన్ రూం, లేబర్ రూం, మినీ వార్డు వంటి గదులు ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ ఒకరు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్, ఫార్మసిస్ట్ ఉంటారు.

స్పెషలిస్ట్ వైద్యులు

ఆస్పత్రిలో నిత్యం ప్రధాన వైద్యాధికారితో పాటు స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందిస్తారు. సోమవారం చిన్నపిల్లల వైద్యులు, బుధవారం ఈఎన్‌టీ , సర్జన్, జనరల్ ఫిజీషియన్, గురువారం స్త్రీ వైద్య నిపుణులు (గైనకాలజిస్ట్), శుక్రవారం చర్మ వ్యాధుల నిపుణులు (డెర్మటాలజిస్ట్), శనివారం ఆర్థోపెడిక్ వైద్యులు సేవలు అందించనున్నారు.

44, 134 మందికి చేరువలో వైద్యసేవలు

వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, మింది, గుడివాడ అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్, కాళికా నగర్, గిరిప్రసాద్ కాలనీలకు చెందిన 9 సచివాలయాల పరిధిలో 44, 134 మందికి డాక్టర్ వైస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందనున్నాయని కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు. ముఖ్యంగా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ సిగ్నల్ పాయింట్ వరకు యాక్సిడెంట్ జోన్‌గా ముద్ర పడటంతో రోడ్డు ప్రమాద బాధితులకు ఈ ఆరోగ్య కేంద్రంలో సేవలు అందుతాయని భావిస్తున్నారు.



ఆస్పత్రిలో ల్యాబొరేటరీ

అందుబాటులో మెరుగైన వైద్యం



ఆరోగ్యకేంద్రంలో అన్ని వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. నిత్యం అందే వైద్యసేవలతో పాటు ప్రతీ రోజు ఒక స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చి సేవలు అందిస్తారు. ముఖ్యమైన వైద్య పరీక్షలు ఇక్కడే చేసేందుకు ల్యాబ్ ఉంది. 172 రకాల మందులు ఉన్నాయి. ఎమర్జెన్సీ సేవలు, మేజర్ ఆపరేషన్లు కూడా చేస్తాం. అత్యవసర సేవలకు 108లో కేజీహెచ్‌కు పంపిస్తాం.

–డాక్టర్ ఎ.ప్రియాంక, ఆస్పత్రి వైద్యాధికారి

వలంటీర్ల సేవలు ఎనలేనివి

అగనంపూడి: ప్రజల ముంగిటకే సేవలను అందిస్తూ మన్ననలు అందుకుంటున్నారు వలంటీర్లు. కరోనా విపత్కర వేళ వారు చేసిన సర్వీస్‌కు సలాం చేస్తున్నారు. ప్రతీ ఇంటికి ఆత్మబంధువులై సేవలందిస్తున్నారని లబ్ధిదారులు కొనియాడుతున్నారు.

వాలంటీర్లకు వందనం

ఆస్పత్రికి వచ్చి పింఛన్ ..



నాకు వృద్ధాప్య ఫింఛన్ అందుతుంది. ఈ మధ్య క్యాన్సర్‌తో అగనంపూడిలోని హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాను. పింఛన్ తీసుకునేందుకు వెళ్లలేని పరిస్థితి. వలంటీర్ కనకమహాలక్ష్మి ఆస్పత్రికి వచ్చి నాకు పింఛన్ అందజేస్తోంది. క్యాన్సర్ ఆస్పత్రికి రావాలంటే చాలా మంది భయపడతారు. కానీ ఆమె ఎంతో బాధ్యతగా తన విధులు నిర్వర్తిస్తోంది. ఆమె మేలు మరిచిపోలేను. – బంకి సోమినాయుడు, నాతయ్యపాలెం

గతంలో పెన్షన్ కోసం పడిగాపులు



అప్పట్లో రెండు, మూడు మాసాలకు ఒకసారి పింఛన్ అందించేవారు. దాని కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవాళ్లం. ముఖ్యమంత్రి జగన్ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తరువాత ప్రతీ నెల ఒకటో తేదీన కోడి కూయక ముందే ఇంటికొచ్చి పెన్షన్ అందిస్తున్నారు. ప్రజలకు సేవ చేసేందుకు చక్కని వ్యవస్థ ఏర్పాటు చేశారు. కృతజ్ఞతలు.

– దేవుదమ్మ, కొండయ్యవలస

కరోనా సమయంలో ఎంతో అండ



వలంటీర్లు కరోనా కష్టకాలంలో ప్రజలకు తోడు గా ఉన్నారు. కరోనా మహమ్మారితో ఆత్మీయులు, బంధువులే రాలేని పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి మా ఇంటికి వచ్చి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు కృషి చేశారు. ఆ సమయంలో అనారోగ్యంతో అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాకు అక్కడికి వచ్చి పింఛన్ అందించారు. వారి సేవలు వెలకట్టలేం.

– పొన్నగంటి తాతారావు, దువ్వాడ

87వ వార్డులో రూ.33 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలో రూ.13.03 లక్షలతో చేపట్టనున్న నీటి సరఫరా పనులు, సిద్ధార్థ నగర్‌లోని పంపుహౌస్ వద్ద రూ.19.98 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, బలిరెడ్డి నాగేశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఆదారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అపురూపం.. బాలాజీ నేత్ర దర్శనం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో స్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు స్వామి నేత్రదర్శనం కల్పించారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు, దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

900 రోజులకు చేరువలో ఉక్కు ఉద్యమం

- పౌరగ్రంథాలయంలో సదస్సు నేడు
- 'సేవ్ వైజాగ్ స్టీల్' పాదయాత్ర రేపు
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వెల్లడి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణ ఉద్యమం 900 రోజులకు చేరువవుతున్న తరుణంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 889వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పౌరగ్రంథాలయంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై మేధావుల సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 22వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు హిందుస్థాన్ జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెం వరకు సేవ్ వైజాగ్ స్టీల్ పేరుతో పాదయాత్రను నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

30న నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర

ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు ఉక్కు నిర్వాసిత కాలనీలైన అగనంపూడి, వడ్లపూడి, గంట్యాడ, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, గంగవరం తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిస్తామని రాజశేఖర్ తెలిపారు. ఉక్కు ఉద్యమం 900 రోజులకు చేరుకున్న సందర్భంగా ఈ నెల 31వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని, కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: అర్హతే ప్రాతిపదికగా పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు ఇ.మర్రిపాలెంలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా, ప్రజలకు మేలు చేసే ఎన్నో కార్యక్రమాలను మన సీఎం అమలు చేస్తున్నారన్నారు. అటువంటి నాయకుడి పాలన మరింత కాలం కొనసాగేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రతీ విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై చులకనగా మాట్లాడటం పవన్ కల్యాణ్, చంద్రబాబుల అవివేకానికి నిదర్శనమన్నారు. అటువంటి విమర్శలకు దీటుగా జవాబు చెప్పాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్-2 ఇల్లపు ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కింతాడ ఈశ్వరరావు, అమరపిని రమేష్, పచ్చికోరు రమణమూర్తి, శంకర్, నాయుడు, నూకరత్నం, రామకృష్ణ, రమణమ్మ పాల్గొన్నారు.

రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ రతన్‌రాజ్

అల్లిపురం : రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి చేస్తోందని కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ వి.రతన్‌రాజ్ తెలిపారు. విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో అధికార బాషా వార్షిక సదస్సు 2023 గురువారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో రాజభాషను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, విశాఖ రిఫైనరీ హెచ్‌ఆర్ జి.కిరణ్‌కుమార్, జనరల్ మేనేజర్ లాలన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

'వైఎస్ భారతిని విమర్శించే హక్కు వారికి లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా చినతల్లి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, ఆయన సతీమణి వైఎస్ భారతిని విమర్శించే హక్కు టీడీపీ మహిళలకు లేదని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి అన్నారు. స్థానిక బీసీ రోడ్‌లోని టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ మహిళలు సీఎం జగన్ మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. సమావేశంలో ఈగలపాటి యువశ్రీ, గంగులూరి రోజారాణి, ప్రమీల, ఉమ, ఈశ్వరి, మీరా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపునకు 'ప్రశస్త్'



ప్రశస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో దివ్యాంగ చిన్నారులను గుర్తించే ప్రశస్త్ స్క్రీనింగ్ యాప్‌ను ఉపాధ్యాయుల సెల్‌ఫోన్లలో డౌన్ లోడ్ చేయించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్. కాంతం మాట్లాడుతూ ఏపీఎస్ఎస్ఏ సహిత విద్యావిభాగం వారి ఆదేశాల మేరకు ఉపాధ్యాయులతో ఈ యాప్ డౌన్‌లోడ్ చేయించినట్లు చెప్పారు. నిబంధనలను అనుసరించి వివరాలను యూ డైస్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గాజువాక విద్యా విభాగం సమన్వయకర్త విమల, ఉపాధ్యాయులు కుమార స్వామి, దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అమవార్ల అనుపోత్సవం



అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం అందుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



ఊరేగింపులో బల్ల వేషాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామ దేవతలు దుర్గమాంబ, కుంచుమాంబ అమ్మవార్ల అనుపు ఉత్సవాన్ని గురువారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ఘటాల ఊరేగింపులో బల్లవేషాలు, సాముగరిడీలు, డప్పు వాయిద్యాలు అలరించాయి. భక్తుల కోలాహలంతో గ్రామంలో సందడి నెలకొంది. ఉదయం ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, గొంతిన వెంకటలక్ష్మి, నంబారు రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీపూజ



తులసీదళాల నడుమ అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు.

చిన్నారి సాహితి ఔదార్యం



నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న సాహితి తదితరులు

గాజువాక: సాయం చేయాలనే మనసు ఉండాలే గానీ, వయసుతో పని లేదని రుజువు చేస్తోంది చిన్నారి సాహితి. అనారోగ్యానికి గురై, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరు వ్యక్తులకు సాయం చేసి ఉదారతను చాటుకుంది. వివరాలివి.. స్థానిక ఇందిరా కాలనీకి చెందిన గొంప సాహితి 6వ తరగతి చదువుతోంది. ఖాళీ సమయాల్లో మొక్కలను అమ్ముతూ కొంత డబ్బును కూడబెట్టుకోవడంతో పాటు బంధువుల నుంచి సేకరించిన డబ్బును కూడా కలిపి జేడీ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఇందిరా కాలనీకి చెందిన జి.ఆదిలక్ష్మి, కొత్తకోట ఉపేంద్ర అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సాహితి తాను సేకరించిన డబ్బులతో నిత్యావసర సరకులను కొనుగోలు చేసి, వారికి అందజేసింది. సాహితిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు మాదాన అప్పలరాజు, తాడి వరలక్ష్మి, అనసూయ, నర్గీస్, పట్టా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాట మహోత్సవం



గ్లోబెక్స్ వద్ద రాట మహోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ మహా గణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గుడివాడ అప్పన్నకాలనీ రోడ్డులోని గ్లోబెక్స్ వద్ద గల సీఎంఆర్ ఓపెన్ సైట్‌లో ఏర్పాటు చేయనున్న నిలువెత్తు గణపతి విగ్రహ ప్రతిష్ఠకు గురువారం రాట మహోత్సవం నిర్వహించారు. మంత్రి సీదిరి అప్పలరాజు భార్య సీదిరి శ్రీదేవి చేతుల మీదుగా భూమి పూజ, పందిరి రాట మహోత్సవం జరిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గణబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక జెడ్సీ పి.సింహాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లా చినతల్లి, సినీ నటుడు ప్రసన్న కుమార్, గుడివాడ అప్పలరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీవనంపై సామాజిక మాధ్యమాల ప్రభావం



సదస్సులో ప్రసంగిస్తున్న ఆచార్య డి.వి.ఆర్.మూర్తి

ఏయూక్యాంపస్: మానవ జీవనాన్ని సామాజిక మాధ్యమాలు ప్రభావితం చేస్తున్నాయని ఏయూ జర్నలిజం విభాగం ఆచార్యులు డి.వి.ఆర్ మూర్తి అన్నారు. ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన మాస్ మీడియా ప్రభావంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు మనిషి సమయాన్ని, కాలాన్ని మాస్ మీడియా నిర్ణయిస్తున్న విధానం వివరించారు.గతంలో టీవీ సమూహంగా కుటుంబమంతా వీక్షించే మాధ్యమంగా ఉండేదని, నేడు ఇది వ్యక్తిగతంగా చూసే మాధ్యమంగా మారిపోయిందన్నారు. సమాచారం ఇచ్చే స్థాయి నుంచి ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించే దిశగా మాస్ మీడియా రూపాంతరం చెందిన విధానాన్ని వివరించారు. వార్తలు, ప్రకటనలు, ప్రసంగాలు వంటివి మనల్ని ఎంతవరకు ప్రభావితం చేస్తున్నాయి అనే అంశాలను పలు ఉదాహరణలతో వివరించారు. నూతన వస్తువులను కొనుగోలు చేసే విధంగా మనల్ని ప్రేరేపించే ప్రకటనలు, వారి వ్యూహాలను సోదాహరణంగా వివరివించారు. చిన్నారులకు ఎటువంటి కంటెంట్‌ను వీక్షించాలి, సెన్సార్ వంటి అంశాలను తెలియజేశారు.

దుర్గమ్మ ఆలయంలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న గుజ్జారి శ్రీను

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యారాడలో దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. గుజ్జారి శ్రీను, సత్యాల గోవిందరావు, బంకా అనిల్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిల్ల అప్పారావు, బంకా రాము సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.